## రజతోత్సవ సభపై సర్కారు పన్నాగం

మొదటిపేజీ తరువాయి...

సభలు, ర్యాలీలు, ఊరేగింపులను నిషేధిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి.

**వరంగల్ సీపీ ప్రకటన ఇదీ...**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏప్రిల్ 6 నుంచి మే 5 వరకు నెల రోజులపాటు సిటీ పోలీస్ యాక్ట్-30 అమల్లో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులను నిర్వహించడంపై నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. తప్పనిసరిగా మైకులను ఏర్పాటు చేయాలనుకునేవారు ఆయా ప్రాంతాల ఏసీపీల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇలా అనుమతి తీసుకున్నా... ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే మైక్ వినియోగించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## భూములు అన్యాక్రాంతమైతే ఊరుకోం

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య**

రవీంద్రభారతి, ఏప్రిల్ 6: హెచ్‌సీయూకు ప్రభుత్వం ఇచ్చిన భూమి అన్యాక్రాంతమైతే ఊరుకునేదిలేదని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. కంచె గచ్చిబౌలి భూములపై కొందరు కన్ను వేసి కాంట్రాక్టర్లకు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆ చర్యలు వెంటనే విరమించుకోవాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని స్పష్టంచేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన హెచ్‌సీయూ, ఓయూ విద్యార్థుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడారు.

# ఆ అడవిపై అయోమయం

మొదటిపేజీ తరువాయి...



రకాల జంతువులు, పక్షులు ఎన్నో ఈ జూపార్కులో ఉన్నాయి. వరంగల్‌లో పెరిగిన జనాభా, రద్దీ, వాహనాల శబ్దం, కాలుష్యం కారణంగా ఈ జూపార్కును నగర శివారు ప్రాంతాలకు తరలించే ప్రతిపాదనలను అటవీశాఖ సిద్ధంచేసింది. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ ఏడాది జనవరి 11న వరంగల్ జూపార్కును సందర్శించారు. అక్కడికి కొత్తగా తెచ్చిన పెద్ద పులులను సందర్శకులు చూసే ప్రక్రియను ప్రారంభించారు. వరంగల్ జూపార్కును దేవునూరు అటవీ ప్రాంతానికి తరలిస్తామని, జంతువులకు ఏ చిన్న ఇబ్బంది లేకుండా అక్కడ ఏర్పాట్లు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. కలెక్టర్ సహా ఇతర ముఖ్య అధికారుల సమక్షంలోనే మంత్రి సురేఖ జూపార్కు తరలింపు విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత అటవీ శాఖ అధికారులు దేవునూరులోని దట్టమైన అటవీ ప్రాంతం కాకుండా అడవి మొదలయ్యే ప్రదేశంలో కొత్త జూపార్కును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనిలో నిమగ్నమయ్యారు.

**అటవీశాఖకు కలెక్టర్ ఆదేశాలు**

దేవునూరు అటవీప్రాంతంలో జూపార్కు ఏర్పాటు ప్రక్రియ జరుగుతుండగానే అదే అడవిలోని భూములను కొందరు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని హనుమకొండ జిలా కలెక్టరు మార్చి 27న అటవీశాఖ జిల్లా అధికారికి ఆదేశాలు ఇచ్చారు. 1967లో రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించాలని ప్రతిపాదించిన భూములను ఇప్పుడు కొందరికి అప్పగించేలా నిర్ణయించడంపై అటవీ శాఖ అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రెవెన్యూ, సర్వే ల్యాండ్, అటవీ శాఖల సంయుక్త సర్వే తుది నివేదిక రావాల్సి ఉన్నదని, ఆలోపే అటవీ భూములపై ఆదేశాలు ఇవ్వడం సరికాదని వారు అభ్యంతరాలను వ్యక్తంచేస్తున్నారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటనకు, హనుమకొండ కలెక్టర్ ఆదేశాలు విరుద్ధంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి**

అందమైన గుట్టలు, అటవీ, జల వనరులకు ఆలవాలంగా ఉన్న దేవునూరు ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ సర్కారు ప్రణాళికలు వేసింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ధర్మసాగర్-దేవునూరు మధ్య 4,000 ఎకరాల ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ప్రణాళికలు రూపొందించింది. ధర్మసాగర్ చెరువు మీదుగా దేవునూరు ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి కోసం రూ.50 కోట్లతో ప్రణాళిక సిద్ధమైంది. తొలిదశలో రూ.5 కోట్లతో పనులను కూడా మొదలుపెట్టారు. ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలోని 3,950 ఎకరాల్లో ఈ ప్రాంతం విస్తరించి ఉన్నది.

**అడవిలో ఉండే జంతుజాలాలు**

వరంగల్ నగరానికి సమీపంలో ఉన్న దేవునూరు అటవీప్రాంతం పూర్తిగా గుట్టలు, జలాశయాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. గజ్జెల జింకలు, మచ్చల జింకలు, గుడ్డేలుగులు, పునుగు పిల్లులు, అడవి పిల్లులు, ముండ్ల పందులు, అడవి పందులు, ముంగీసలు, కొండ గొర్రెలు, కుందేళ్లు, ఉడుములు, కొండ చిలువలు, నాగుపాములు, జెర్రిపోతులు, గద్ద జాతి పక్షులు, గుడ్లగూబలు, జిట్ట పిట్టలు, జీనువాయి పిట్టలు, కొంగలు వంటి 80 జాతుల జంతువులు, సరీసృపాలు, పక్షులు ఈ ప్రాంతంలో మనుగడ సాగిస్తున్నాయి. 25 రకాలకు పైగా సీతాకోక చిలుక జాతులు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. వేల పక్షులు ఈ జలవనరుల్లో ఉంటున్నాయి.

### నిజాం రికార్డుల్లో దేవునూరు

నిజాం హయాంలోని రికార్డుల్లోనూ దేవునూరు అటవీ ప్రాంతం అని ఉన్నదని, ఈ ప్రాంతంలో జీవ వైవిధ్యం ఎంతో గొప్పగా ఉంటుందని పర్యావరణవేత్తలు చెప్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడా లేనన్ని ఔషధ మొక్కలు ఈ ప్రాంతంలో ఉన్నాయని అటవీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అటవీ శాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, వనసేవ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో వనదర్శిని విజ్ఞానయాత్రలను, బర్డ్ వాక్, ఫారెస్ట్ వాక్ లాంటి అనేక పర్యావరణ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ట్రెక్కింగ్, నైట్ క్యాంపింగ్ వంటి ఉల్లాసవంతమైన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తారు. ఎంతో మంది పర్యావరణ ప్రేమికులు, పరిశోధన విద్యార్థులు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు ఇక్కడికి నిత్యం వస్తుంటారు.

# 43 ఎకరాలపైనే వివాదం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు కలెక్టర్ చర్యలు
- అటవీ శాఖ ఆదేశాలు రాలేదు
- 'కారడవిలో పాగాకు ముంజేతి కడియం' కథనంపై హనుమకొండ ఆర్డీవో వివరణ

వరంగల్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణప్రతినిధి) : దేవునూర్ ఇనుపరాతి గుట్టల అటవీ ప్రాంతంలో 43.38 ఎకరాలపైనే అటవీ శాఖకు, కొందరి మధ్య వివాదం ఉన్నదని.. మిగిలిన 3,900 ఎకరాలు అటవీ శాఖకు చెందినవేనని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్ తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విన్నపం మేరకు హనుమకొండ కలెక్టర్ ఆదేశాలతో 43.38 ఎకరాలను ప్రైవేటు వారికి అప్పగించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అటవీ ప్రాంతంలోని భూముల నిర్ధారణపై అటవీ, రెవెన్యూ శాఖ సంయుక్త సర్వే నివేదికలోని అంశాలపై అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని, అందుకు అటవీ శాఖ అధికారులు అభ్యంతరం చెప్తున్నారని ఆయన పేర్కొన్నారు. 'కారడవిలో పాగాకు ముంజేతి కడియం' శీర్షికన ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై హనుమకొండ ఆర్డీవో వివరణ ఇచ్చారు. ఆ వివరాలు ఇలా.. 'ధర్మసాగర్ మండలం ముప్పారం, దేవునూరు గ్రామ రైతులు పట్టా భూములు సాగు చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటే అటవీ సిబ్బంది అడ్డుకున్నారని వారు తమ బాధను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విన్నవించారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని హనుమకొండ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి జాయింట్ సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే కడియం విన్నపం మేరకు హనుమకొండ కలెక్టర్ ఆదేశాల ప్రకారం అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించాయి. ఇనుపరాతి గుట్ట ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్టు బ్లాక్ చేసేందుకు ముప్పారం, దేవునూర్, ఎర్రబెల్లి, దామెర, కొత్తపల్లి పరిధిలో 3,750 ఎకరాల విస్తీర్ణంతో అటవీ శాఖ 60ఏండ్ల క్రితం ప్రతిపాదనలు పంపిం ది. ఆ తర్వాత అటవీ, ఉమ్మడి సర్వేతో 3,956 ఎకరాలను ఫారెస్టు బ్లాక్ ఏర్పాటుకోసం తమ ఆధీనంలో ఉన్నట్టుగా నిర్ధారించింది. ముప్పారంలోని 213, 214, 215, 216 సర్వే నంబర్లు... దేవునూర్‌లోని 403, 404 సర్వే నంబర్ల భూములు అటవీశాఖ ముసాయిదా నోటిఫికేషన్‌లో లేవు. అయినా 43.38 ఎకరాల విస్తీర్ణంలోని ఈ భూములు అటవీ శాఖ ఆధీనంలో ఉన్నట్టుగా గుర్తించింది. రెవెన్యూ రికార్డుల్లో పైసర్వే నంబర్ల భూముల్లో వారసత్వ, కొనుగోలు పద్ధతిలో 23 మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయి. 43.38 ఎకరాలపైనే అటవీ శాఖకు, కొందరికి మధ్య వివాదం ఉన్నది. మిగిలిన 3,900 ఎకరాలపై వివాదం లేదు. ఈ విషయమై సర్వే నివేదికను కలెక్టర్‌కు సమర్పించగా పట్టాదారులకు భూములు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ శాఖ జిల్లా అధికారులు సర్వే నివేదిక అంశాలను ఆ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి ఆదేశాల కోసం సమయం కోరారు' అని హనుమకొండ ఆర్డీవో పేర్కొన్నారు.



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవునూరు, ముప్పారం ఇనుపరాతి గుట్టలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## దేవునూరు భూముల కబ్జాకు 'కడియం' యత్నం

- కూతురు, అల్లుడితో కలిసి కుట్ర
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- లేకుంటే బీఆర్ఎస్ పక్షాన న్యాయపోరాటం చేస్తాం
- మాజీ ఉపముఖ్యమంత్రి, బీఆర్ఎస్ నేత రాజయ్య

ధర్మసాగర్, ఏప్రిల్ 6: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం, దేవునూర్ గ్రామాల పరిధిలోని ఇనురాతి గుట్టల్లో అటవీ శాఖకు చెందిన భూములను కబ్జా చేసేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురైన ఎంపీ కావ్య, అల్లుడు నజీర్ యత్నిస్తున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి, బీఆర్ఎస్ నేత రాజయ్య ఆరోపించారు. 'నమస్తే తెలంగాణ'లో 'కారడవిలో పాగాకు ముంజేతి కడియం!'..రెండున్నర వేల ఎకరాల అటవీ భూమిపై కన్ను' అన్న ప్రత్యేక కథనం ఆదివారం ప్రచురితమైంది. దీంతో ఇనుపరాతి గుట్టలను రాజయ్య ఆదివారం సందర్శించి, అక్కడి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అయ్యాక కడియం శ్రీహరి, ఆయన బిడ్డ ఎంపీ కావ్య, అల్లుడు నజీర్ తమ బినామీల పేరిట రెండు వేల ఎకరాలను అక్రమంగా దోచుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులను వాడుకొని ఇప్పటికే బుల్డోజర్లు పెట్టి అడవిని నరికేస్తూ, కబ్జా చేయడానికి పనులను ప్రారంభించారని తెలిపారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. 4 వేల ఎకరాల భూముల్లో సగం భూములను బినామీల పేరుతో కబ్జా చేసేందుకు కలెక్టర్‌పై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారని, ఈ విషయంలో కలెక్టర్ ప్రమేయమున్నందున సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు. ఈ అటవీ స్థలాన్ని ఎవరు కొన్నా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోనికి వచ్చాక వెనక్కి తీసుకొని అటవీశాఖకు అప్పగిస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నా ఈ విషయంలో పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. అధికారులు ప్రభుత్వ భూములకు పరిరక్షణగా ఉండాలని, ప్రజాప్రతినిధుల చేతిలో కీలుబొమ్మగా ఉండొద్దని రాజయ్య ఈ సందర్భంగా హితవు పలికారు.

## కంచ గచ్చిబౌలిపై కేంద్రంలో కదలిక

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖ
- చెట్ల నరికివేత, వన్యప్రాణులకు నష్టంపై సమగ్ర నివేదికకు ఆదేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలోని భూములు, పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ కోసం పోరాటం జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. సమగ్ర వివరణతో నివేదిక ఇవ్వాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. టీజీఐఐసీ ద్వారా అడవిలోని చెట్లను అక్రమంగా తొలగించినట్టు, అక్కడి వన్యప్రాణులు, సరస్సులు, ప్రత్యేక రాతి శిలలకు నష్టం జరిగినట్టు మీడియా కథనాల్లో చూశామని పేర్కొంది. ఈ విషయంపై పార్లమెంటు సభ్యులు, ప్రజాప్రతినిధుల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, న్యాయస్థానాల ఆదేశాలకు విరుద్ధంగా ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా చూడాలని స్పష్టంచేసింది. ఈ అంశంపై వాస్తవ నివేదికతోపాటు, తీసుకున్న చర్యల వివరాలను పంపించాలని కేంద్రం ఆదేశించింది.

## కంచ గచ్చిబౌలిని కాపాడుకుందాం!

మొదటిపేజీ తరువాయి...

సాధిస్తాయని, చరిత్రను చూస్తే అర్థమవుతుందని ఉద్ఘాటించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను కాపాడేందుకు కదిలివచ్చిన విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని రక్షించి భవిష్యత్తు తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి, దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసిరావడంతో ఉద్యమం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దళారిలా ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం కంచ గచ్చిబౌలి భూముల వేలాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను తప్పుదోవ పట్టించేందుకు బెదిరింపులకు దిగడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ భూముల్లో ఎకో పార్క్ ఏర్పాటు, ఫోర్త్‌సిటీకి యూనివర్సిటీ తరలింపు అంటూ సీఎం కార్యాలయం మొదలుకొని కాంగ్రెస్ నేతల వరకు చేస్తున్న కుట్రలను కేటీఆర్ ఎండగట్టారు. 50 ఏండ్లకుపైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు నిలయంగా, విజ్ఞాన కేంద్రంగా నిలిచిందని తెలిపారు. విద్యార్థుల పోరాటం ఫలించడంతో ప్రభుత్వం చేయబోయిన పర్యావరణ హత్యను సుప్రీం కోర్టు అడ్డుకున్నదని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కుట్రలు ఆపనందున ఈ పోరాటం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కుట్రపూరిత ఎత్తుగడలు, బెదిరింపులు, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకుసాగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు పోరుకు తెలంగాణలోని పర్యావరణవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థిలోకం కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఆ 400 ఎకరాల్లో పర్యావరణ పరిరక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉన్నదని, విద్యార్థుల ఉద్యమానికి అండగా ఉన్నదని, భవిష్యత్తులో మరింత రెట్టింపు ఉత్సాహంతో ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు. యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకునేదాకా పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రతినబూనారు.

## వాస్తవాలను ఏఐతో ముడిపెడ్తరా?

- రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా సీఎం రేవంత్ తీరు
- ఇప్పటికైనా తెలివి తక్కువ పనులు మానుకోవాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ) : కంచె గచ్చిబౌలి వాస్తవాలను ఏఐకు ముడిపెట్టడం హాస్యాస్పదమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. హెచ్‌సీయూలో నెమళ్ల అరుపులు, పోలీసుల లాఠీచార్జిలు, జింకల చావులు, బుల్డోజర్లు కూడా ఏఐ సృష్టేనా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన రివ్యూపై ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రేవంత్ తీరు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా ఉందని విమర్శించారు. సీఎం స్థాయిలో జరగాల్సిన రివ్యూలా లేదని పేర్కొన్నారు. సీఎం తీరును చూసి సామాన్య ప్రజలు సైతం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారులు, అనుచరులు ఇస్తున్న సలహాలపై పునరాలోచన చేసి మాట్లాడితే మంచిదని హితవు పలికారు. సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించడం రేవంత్ పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అసలు ఏఐ కంచె గచ్చిబౌలిలో పుట్టిందా, అక్కడ ఊరకుక్కలు, జింకలను చంపింది ఏఐ సృష్టేనా అని నిలదీశారు. లేనివి సృష్టించడం, తప్పుడు ప్రచారాలు చేయడం రేవంత్‌కే అలవాటని చెప్పారు. ఈ విషయంలో కోర్టుకు పోతామంటే వాళ్లకు చీవాట్లు తప్పవని తెలిపారు. సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్నప్పుడే వాళ్ల ఆలోచన మార్చుకోవాల్సిందని హితవు పలికారు. యూనివర్సిటీనే మార్చుతామన్న రేవంత్ లీకులు అనాలోచితమేనని, అసలు కొత్తగా యూనివర్సిటీ అనుకుంటున్న దగ్గరే 400 ఎకరాలు కూడా ఇచ్చుకోవచ్చు కదా అని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలను తక్కువ అంచనా వేయడం సరికాదని, రేవంత్ ఇప్పటికైనా తెలివి తక్కువ పనులు మాని అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిందని హితవుపలికారు.

# కనిపిస్తున్నదంతా ఏఐ కాదు

- వైరల్ అవుతున్న దృశ్యాలు అన్నీ ఏఐ వీడియోలు కావు
- విద్యార్థినులను పోలీసులు ఈడ్చుకెళ్తున్న దృశ్యాలు ఫేక్ వీడియోలంటే నమ్ముతారా?
- హెచ్‌సీయూ వ్యవహారం జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపుతుంది
- సీఎం రేవంత్‌రెడ్డికి మీనాక్షి నటరాజన్ మందలింపు



హెచ్‌సీయూలో విద్యార్థులతో మీనాక్షి నటరాజన్, వంశీచంద్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కంచ గచ్చిబౌలి వీడియోలన్నీ ఫేక్ అని చెప్పలేమని, వాస్తవ దృశ్యాలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. చెట్లు, నెమళ్లు, జింకలు ఉన్నాయని తెలిసినా, అంత దూకుడుగా ఎందుకు వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మందలించినట్టు తెలిసింది. మహిళా విద్యార్థులను పోలీసులు ఈడ్చుకెళ్తున్న దృశ్యాలు, యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది జింకను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యాలను ఏఐ సృష్టించిన వీడియోలంటే ఎవరైనా నమ్ముతారా? అని నిలదీసినట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. సోషల్ మీడియాలో కృత్రిమ వీడియోలు కూడా ఉన్నాయని, కానీ వాటికి అవకాశం ఇచ్చిందెవరు? అని ప్రశ్నించినట్టు తెలిసింది. శనివారం హెచ్‌సీయూపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థులతో చర్చించిన అనంతరం ఆమె సీఎంతో మాట్లాడినట్టు తెలిసింది. సాధారణ పౌరులతో వ్యవహరించినట్టుగా విద్యార్థులతో వ్యవహరించారని, వారిపై లాఠీచార్జి వరకు ఎందుకు వెళ్లారని నిలదీసినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. హెచ్‌సీయూ అంశాన్ని కేవలం స్థానిక వివాదంగా చూడవద్దని, ఇది దేశ రాజకీయాలతో ముడిపడిన అంశమని పేర్కొన్నట్టు తెలిసింది. సెంట్రల్ వర్సిటీతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుబంధం, చాలామంది విద్యార్థులు, అధ్యాపకులు కాంగ్రెస్ వైపు నిలిచిన విషయాన్ని ఎలా మరిచిపోయారని గట్టిగానే మందలించినట్టు సమాచారం. ఇప్పటికే చాలా నష్టం జరిగిందని, అడ్డగోలు లీకులు, వదంతులతో సమస్యను ఇంకా జఠిలం చేసుకోవద్దని హితవు పలికినట్టు గాంధీభవన్ వర్గాలు అనుకుంటున్నాయి. 'మీరు వేసే ప్రతి తప్పటడుగు జాతీయ రాజకీయాల మీద ప్రభావం చూపెడుతుంది. యూనివర్సిటీ భూములపై ఇక వెనక్కి తగ్గండి' అని సలహా ఇచ్చినట్టు తెలిసింది.

**రాత్రికిరాత్రి ఎందుకు బుల్డోజర్లు పంపారు?**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక న్యాయ పోరాటం చేసి భూమిని దక్కించుకున్నామని, టీజీఐఐసీకి బదలాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకొందని, తర్వాత పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టారని సీఎం ఆమెకు వివరించినట్టు తెలిసింది. 30- 40 ఏండ్లుగా భూమి వినియోగంలో లేకపోవడంతోనే అక్కడ చెట్లు పెరిగి పెద్దవయ్యాయని, అది అటవీ ప్రాంతం కానేకాదని సీఎం సర్దిచెప్పేందుకు ప్రయత్నించినట్టు సమాచారం. అంతకు ముందు మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా అదే క్యాసెట్‌ను వినిపించినట్టు తెలిసింది. మీనాక్షి స్పందిస్తూ... 'మీరు చెప్పినవి నిజమే కావచ్చు. కానీ, అటవీ జంతువులు ఉన్నప్పుడు రాత్రికిరాత్రి ఎందుకు బుల్డోజర్లు పంపారు? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కొనసాగుతున్న బుల్డోజర్ పరిపాలనను వ్యతిరేకిస్తున్న మనం.. ఇక్కడ అదే చేస్తామంటే ఎలా కుదురుతుంది?' అని నిలదీసినట్టు తెలిసింది. యూనివర్సిటీ అధికారులు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో మాట్లాడి జాగ్రత్తగా వ్యవహరించి ఉండాల్సిందని, సామాన్య పౌరుల మీదికి పోలీసులను ఉసిగొల్పినట్టు విద్యార్థుల మీదికి పోలీసులను పంపారని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రత్యేక రాజకీయ పరిస్థితులు ఉన్నాయని, ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నప్పుడు ఆచితూచి ముందుకెళ్లాల్సిందిపోయి ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తున్నారని గట్టిగా తలంటినట్టు సమాచారం. భూమి ప్రభుత్వానిదైనా జాగ్రత్తగా అడుగేయాలని, వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని, అవసరమైతే ఒక అడుగు వెనక్కు వేసినా వచ్చే నష్టం ఏమీ లేదని సూచించినట్టు తెలిసింది.

## పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలు మానుకోవాలి

**సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్**

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మి ప్రభుత్వాన్ని నడపాలనుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి తెలివి తక్కువ తనమని, ఇకనైనా పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంచ గచ్చిబౌలి భూములను అమ్మాలని చూడడం తప్పని, ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సూచించారు. పచ్చని జీవవైవిధ్య ప్రాంతాన్ని నాశనం చేయడమేగాకుండా, అడ్డుకోబోయిన విద్యార్థులను కొట్టడం, కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాపాలన అని నిలదీశారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా హైదరాబాద్ కూడా ఢిల్లీలా వాయుకాలుష్య నగరంగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే ఎన్జీటీని ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.

## హెచ్‌సీయూ భూములను రక్షించుకుందాం

- లేకుంటే హైదరాబాద్ ఎడారిగా మారుతుంది
- రూ.100 కోట్ల కమీషన్ కోసమే కట్టబెడుతుండ్రు
- విలేకరుల సమావేశంలో వక్తల అభిప్రాయం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సామాజికవేత్తలు

ఖైరతాబాద్, ఏప్రిల్ 6 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయం అప్రజాస్వామికమని, ఆ భూములను రక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు తమ స్వార్థపూరిత రాజకీయాల కోసం భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అనేక జీవులు, వృక్షజాతులకు నెలవైన హెచ్‌సీయూ భూములను ఆక్రమించుకునే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. చెట్లను నరికివేస్తే కఠినమైన చట్టాలు ఉన్నాయని, గతంలో చెట్లను నరికిన వారికి న్యాయస్థానాల్లో కోట్లాది రూపాయల జరిమానాలు విధించిన ఘటనలు ఉన్నట్టు గుర్తుచేశారు. ఇన్ని చెట్లు నరికిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎంత జరిమానా విధించాలో ప్రజలే నిర్ణయించాలన్నారు. ఇప్పటికే హైదరాబాద్ కాంక్రిట్ జంగల్‌గా మారిందని, త్వరలోనే ఎడారిగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. తెలంగాణ విఠల్ మాట్లాడుతూ.. తొలి తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థులు అమరులు కావడానికి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ బాధ్యులని, తాను చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు హైదరాబాద్ నగరానికి పలు కర్మాగారాలు, విశ్వవిద్యాలయాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 2,400 ఎకరాల భూమి ఉన్నదని, అందులో రూ.40 వేల కోట్ల విలువైన భూమిని రూ.10 వేల కోట్లకు ప్రభుత్వం కుదువపెట్టిందని, మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ సంస్థ రూ.వంద కోట్ల కమీషన్ మూటగట్టుకుందని ఆరోపించారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ భూముల్లో అనేక వన్యప్రాణులున్నాయని, కానీ, ప్రభుత్వం ఫేక్ వీడియోలు పెట్టారని తోసిపుచ్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ప్రతినిధి యాదగిరి, కోల జనార్దన్, అరుణ, రాజేంద్రప్రసాద్, మురళీధర్ దేశ్‌పాండే, పరశురాములు, ఆకాశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మన గ్రూపుల్లో పోలీసులెందుకు?

- వాట్సాప్ గ్రూపుల్లోకి ఎంట్రీపై గ్రామగ్రామాన విస్తృత చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లోకి ఎంట్రీ ఇచ్చి.. పోలీసుల ద్వారా గ్రామస్థుల సంభాషణలు, అభిప్రాయాలను తెలుసుకోవాలన్న ప్రభుత్వ ఆలోచనకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. 'నమస్తే తెలంగాణ' కథనంతో అలర్ట్ అయిన ప్రజలు.. పోలీసుల ఎంట్రీపై తీవ్రంగా చర్చించుకుంటున్నారు. 'మన గ్రూపుల్లోకి పోలీసులు వచ్చి ఏం సమాచారం తెలుసుకుంటారు? ఎందుకోసం రావాలనుకుంటున్నారు? ప్రజా సమస్యలు పక్కనపెట్టి.. ఇలాంటి ఆలోచనలు ఎందుకు చేస్తున్నారు? అంత ఖాళీగా ఉన్నారా?' అంటూ చర్చించుకుంటున్నారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనాన్ని తమ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు చేసుకుంటున్నారు. 'మన గ్రూపుల్లోకి పోలీసులు వస్తే.. ప్రశాంతంగా వాట్సాప్ మెసేజ్‌లు ఏం చేసుకుంటాం' అని కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'ఇకపై మన గ్రామంలో.. మనకే వాక్ స్వాతంత్ర్యం ఉండదా?' అని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'గ్రామాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని కట్టడి చేయడానికి, అవసరమైతే అరెస్టు చేసి, భయపెట్టి దారిలోకి తెచ్చుకునేందుకే ఈ నాటకాలు..' అంటూ మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కొందరి నంబర్లు రిమూవ్?**

గ్రామస్థాయిలో విషయాలు తెలుసుకునేందుకు ఇప్పటికే వివిధ గ్రూపుల్లో ఉన్న ఇంటెలిజెన్స్ సిబ్బందిపై ప్రభుత్వ పెద్దల అత్యుత్సాహ ప్రభావం పడింది. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా... ఏదో ఒక పేరుతో ఇప్పటికే ఉన్న కొన్ని గ్రూపుల్లోని ఇంటెలిజెన్స్ సిబ్బంది నంబర్లను అడ్మిన్‌లు తొలగిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. వివాదాలు, గొడవలు ఇతర అంశాలపై గ్రామాల్లోకి గస్తీకి వస్తున్న పోలీసులు వాట్సాప్ గ్రూపుల ప్రస్తావన తీసుకొస్తూ తమను యాడ్ చేయాలని అడుగుతున్నారు. దీంతో 'ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే డయల్ 100కి కాల్ చేస్తాం లే సార్. మా ఊర్లో మస్తు విషయాలు ఉంటాయి. అవన్నీ మీకెందులే సార్' అని సున్నితంగా తిరస్కరిస్తున్నట్టు తెలిసింది.